# అలుపు




ఎక్కడో పులి గాండ్రించింది. గడ్డి దుబ్బులో పడుకుని మగత నిద్రలో వున్న లేడిపిల్ల ఉలిక్కిపడి లేచింది. చుట్టూ చూసింది. తనెక్కడుందో క్షణం మర్చిపోయింది. చెట్ల మీద కోతులు కిచకిచ మంటుంటే లేడిపిల్ల భయంతో గజగజ వణికింది. చుట్టూ చూస్తే తన వాళ్ళెవరూ లేరు. ఎక్కడికి పోయారో? తను ఒకతే అడవి మధ్యలో వుండి పోయింది.

దూరంగా దిక్కులు పిక్కటిల్లేలా మళ్లీ పులి గాండ్రింపు. లేడిపిల్ల చెంగున ఎగిరింది. తనక్కడ ఒక్కక్షణం వున్నా ప్రమాదమేనని కంగారుగా ఎగిరింది. భయంతో తడబడింది. ముందు కాలు మడతపడితే, సన్నగా మూల్గింది. బలాన్నంతా పుంజుకుని పరుగు లంగించుకుంది. చెంగు చెంగున ఎగురుతూ ముందు కురుకుతోంది. దారి తెలియటం లేదు. తను ఎటు నుంచి వచ్చిందో గుర్తు రావటం లేదు. పనసచెట్టు నీడలో పచ్చిక మేసినట్లు గుర్తు. అదెక్కడో కనిపించదే? సెలయేటి మధ్యలో నల్లబండ రాయి మీద నిలబడి నీరు తాగిన గుర్తు. అసలు ఆ ఏరెక్కడికి పోయిందో తెలీడం లేదే—

పులి గాండ్రింపు క్రమేపీ దూరమైంది. అంటే తను పులులుండే అడవి దాటి పోయిందన్న మాట. ధైర్యం చిక్కింది. కాళ్ళలో బలం పెరిగింది. గమ్యమెరుగని పరుగు. దారి తప్పిన లేడిపిల్ల గాభరాతో, భయంతో అదిరే గుండెలతో ఆగలేని పరుగు— అది ముందుకు పరుగెడుతూనే వుంది.

*

గడియారం అయిదున్నర కొట్టింది. హరిణి హటాత్తుగా తలెత్తి గడియారంకేసి చూసి, ఆఫీసంతా పరికించింది. ఎవ్వరూ లేరు. అంతా వెళ్లిపోయారు. ఆఫీసు టైము ఎప్పుడో అయిపోయింది. ఎంత జాగ్రత్తగా చేసినా స్టేట్‌మెంట్ టాలీ కావటంలేదు. ఆఫీసు మేనేజరు వ్యాఘ్రేశ్వర రావు బయటికెళ్ళి కాఫీతాగి వక్కపొడి నములుతూ వచ్చి, తన సీట్లో కూర్చుని సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ పొగ రింగులు తిరుగుతూ పైకిపోతోంది.

హరిణి మనసులో ఆలోచనలు గందరగోళంగా వెనక్కీ ముందుకీ కదలుతున్నాయ్. అందుకే అంకెలు కలిసిపోతున్నాయి. కూడిన కూడిక సగంలో టప్‌మని తెగిపోతోంది. మళ్ళీ మొదలు — మళ్ళీ తెగిపోవడం - మొదటికి రావడం. గడియారం ముల్లు మాత్రం ముందుకే సాగిపోతోంది. ఆ ముల్లు ఆరు మీదకి వస్తుంటే ఆమెకి భయంగా, దడగా వుంటుంది. ఏదో బలహీనత ఆవరిస్తుంది. నరాలన్నీ నీరసంగా, నిస్సత్తువగా అయిపోతాయి.

ఆరోజు—

ఆరు గంటలకి యింకా అయిదు నిముషాలుందనగా పదిమంది తన తండ్రి శవాన్ని వ్యానులో తీసుకొచ్చి యింటి ముందు దింపారు. నలభై నాలుగేళ్ళకే తన తండ్రికి నూరేళ్లు నిండాయి. అమ్మ కళ్ళు తిరిగి పడిపోయింది. తను మతిపోయిన దానిలా బిత్తరపోయి నిలబడిపోయింది. తమ్ముళ్ళిద్దరూ అమ్మ దగ్గర కూర్చుని ఏడుపు మొదలు పెట్టారు. చెల్లెలు-విషయం అర్థం చేసుకుని "అక్కా" అంటూ బావురుమంది.

ఆ క్షణాలు, ఆ హటాత్పరిణామం ఆమె మనసు మీద ఎలా పని చేశాయోగాని, తనకా సమయమంటే భయం!

హరిణి ఆలోచనలు సాగిపోతున్నాయి. స్టేట్‌మెంటు ఆగిపోయింది.

"ఏమిటీ మీ పని కాలేదా" అంటూ ఆమె దగ్గరకొచ్చి పలకరించాడు వ్యాఘ్రేశ్వర్రావు.

హరిణి తడబడి లేచి నిలబడింది.

"ఎస్సర్. అయిపోవచ్చింది" అంది.

"పోనీ రేపు చూసుకోవచ్చు" అంటూ వాచీ చూసి, ఐర్రుమని ఒక కుర్చీ లాక్కుని ఎదురుగా కూర్చున్నాడు. హరిణి మనసు గజగజ వణికిపోయింది.

"ఏమిటండీ! మీరంత భయపడుతూ ఉంటారు? ఉద్యోగంలో చేరి రెండు నెలలైనా యిలాగే వున్నారు—" అన్నాడు సూటిగా ఆమెను చూస్తూ.

హరిణికి ఏం చెయ్యాలో తెలీలేదు. ఒక నవ్వు నవ్వింది.

"అయినా మీరు జాయిన్ అయ్యాక పార్టీ యివ్వారా" అన్నాడు.

హరిణి అయోమయంగా చూసింది. అతని ఎక్స్‌రే చూపులు ఆమె ప్రతి అవయవాన్ని పలకరిస్తున్నాయి.

"నా కింద రెండు రోజులు ఎవరు పనిచేసినా ఈ బెరుకుతనం — అవీ....పోతాయి" అన్నాడు ఓరగా ఆమెనే చూస్తూ—

హరిణి మరీ ముడుచుకుపోయింది. ఆమె మనసు పరుగులు పెట్టేస్తోంది. ఏమిటీ మాటలు?

తనేం జవాబు చెప్పాలి? ఆ మాటల నిండా ఎంత కుత్సితం – మాటలు మాటలుగా ఎలాంటి అర్థాన్నీ యివ్వలేవు. వాటికి జతకూర్చే ధ్వనిలోనే వుంది అర్థం, అంతరార్థం అది మనసుకి సూటిగా తగులుతుంది. ఆమెకి ఆలోచనల్లోంచి కోపం చర్రున దూసుకొచ్చింది. కాని పేదరాలి కోపం పెదవిలోనే ఆగిపోయింది. వ్యాఘ్రేశ్వరరావు సిగరెట్ కాలుస్తూ నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు.

అంత హఠాత్తుగా నాన్నెందుకు చచ్చిపోవాలి? అనిపించింది. అసలు తను చదువే అంత శ్రద్ధగా చదవలేదు. ఆమెకి చదువుకోవాలనీ వుండేది కాదు. ఏదో తల్లితండ్రుల పోరువల్ల పరీక్షల కెళ్ళింది. అత్తెసరు మార్కులతో ప్యాసయ్యింది. వుద్యోగం చెయ్యాలని ఎప్పుడూ అనుకోలేదు. తను ఏ యింజనీరునో, డాక్టరునో పెళ్లాడి సుఖంగా, కార్లలో తిరగాలనుకునేది. తన తండ్రి చేసింది మంచి వుద్యోగమైనా మిగిల్చింది మాత్రం పెద్దగా ఏమీ లేదు. తల్లీ, నలుగురు పిల్లలు అనాధలు కాకపోయినా నీడలేనీ పక్షుల్లా అయిపోయారు. నాన్నగారి ఫ్రెండు, "చదువుకున్న పిల్లవు వుద్యోగంలో చేరు" అంటూ యీ వుద్యోగం వేయించాడు. చుట్టూ మగాళ్ళు – కోతుల్లా యికిలించేవాళ్ళు, కోరుండి దగ్గరకొచ్చి కోతలు కోసేవాళ్లు. కొన్ని కొన్ని సమయాల్లో తనెంతో చిన్నతనంగా, చిరాకుగా బాధపడుతుంది.

"మిస్ హరిణీ! మీరెళ్ళిపొండి, అది రేపు ఫస్టవర్ చూసుకోవచ్చు" అంటూ లేచాడు మేనేజర్.

హరిణి గబగబా సర్దేసింది. నీరసంగా వున్నా బయటికి వచ్చేస్తున్నాననే ఆనందంతో వుత్సాహంగా కదిలింది.

"రేపు వచ్చిన వెంటనే అది చూసి, నాకు పుటప్ చెయ్యి" అన్నాడు వ్యాఘ్రేశ్వర్రావు. అతని ఏకవచన సంబోధనకి మనసు చివుక్కుమన్నా 'ఎస్సర్' అని ముందుకు కదిలింది.

రోడ్డు మీద ఎన్నో దీపాలు వెలుగుతున్నా ఆమె మనసులో చీకటిగా వుంది. కార్లూ, రిక్షాలు, సైకిళ్ళు ఒకటే రొదచేస్తున్నా, ఆమె మస్తిష్కంలో ఎంతో ఖాళీ, నిశ్శబ్దం – మొద్దుబారిపోయిందా బుర్ర.

ఆమె నడుస్తోంది. బస్సుకోసం ఎదురుచూసే వోపిక లేదు. ముందుకు నడిచిపోవాలి – నడిచిపోవాలి. అదే హరిణి వుద్దేశ్యం. ఆమె కంటే ఆమె మనసు మరీ పరుగులు పెడుతోంది. కనిపించే ప్రపంచమంతా జీవముండి నోరులేని అడవిలా – జీవం లేని రాళ్ల గుట్టలా, కదిలే వదిలో కొట్టుకువస్తున్న చెత్తలా వుంది.

ఇంటికెడితే ఎంతోపని. అమ్మ పూర్తిగా మంచమెక్కింది. చెల్లాయి చదువు ధ్యాసలో వుంటుంది. ఏదో వంతు వేసుకుని కొంత పని చేసి, మిగిలింది తనకోసం అట్టే పెడుతుంది.

వెనుక నుంచి స్పీడుగా వెళ్ళిపోయింది వ్యాఘ్రేశ్వర్రావు కారు. హరిణి మనసు అసూయతో కుతకుతలాడిపోయింది. ఇంట్లో అడుగు పెడుతుండగా వనజ వచ్చి.

"అక్కా అమ్మకేం బాగాలేదు" అంది.

"ఏం? ఎందుకని?"

"ఏమో ఒకటే నీరసం. వేళ్ళాడిపోతోంది. మాట్లాడలేకపోతోంది" అంది.

"డాక్టరు దగ్గరకి తీసుకెళ్దాం"

"నువ్వు కాళ్ళూ చేతులూ కడుక్కో, కాఫీ యిస్తా".

ఇద్దరూ తల్లిని హాస్పటల్‌కి తీసుకెళ్ళారు.





# "లోధ్ర" టానిక్ వనితలకు మాత్రం!

ప్రకృతి సిద్ధమైన పద్ధతి ద్వారా ఆరోగ్యంగా ఉండడానికి
నెలలో ప్రతిరోజూ బాధలేని రోజుగా గడపడానికి
"లోధ్ర" టానిక్ తీసుకోండి! ఏ బాధా లేకుండా ఆరోగ్యమయమైన జీవితాన్ని గడపండి.

78 సంవత్సరాల నుంచీ స్త్రీల విశ్వాసానికి పాత్రమైన టానిక్.
"లోధ్ర" మందుల షాపులలో దొరుకుతుంది.

Sistas

ఉచితమైన వైద్య సలహాలకు క్రింది చిరునామాకు ఈ కూపనును పూర్తిచేసి, మీ ఉత్తరంతోబాటు జతచేసి పంపండి.

పేరు : ____________

చిరునామా : ____________

____________

____________ PIN ____________

## కేసరి కుటీరం (ప్రై) లిమిటెడ్

27, వెస్ట్‌కాట్ రోడ్, రాయపేట, మద్రాసు-600 014

ఏజంట్లు : శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్, విజయవాడ, సికింద్రాబాదు.

డాక్టరుగారు ఎంతో అభిమానంగా చూశారు. మందులు రాసిచ్చి, హరిణితో ప్రత్యేకంగా చెప్పారు ఆమెకి పూర్తిగా విశ్రాంతి నివ్వాలని.

*

ఎప్పుడూ ఆఫీసు టైములోపల హరిణి పని పూర్తికాదు. అంతా వెళ్లిపోతారు. తనొక్కర్తే కూర్చుని పని చెయ్యాల్సివస్తుంది. హరిణి ఎన్నో సార్లు అనుకుంది వుద్యోగం మానేద్దామని. కాని ఎలా మానడం? ఇంట్లో ఏమని చెప్పడం? తన జీతం వస్తేనే యిల్లు గడవడం కష్టంగా వుంది. అక్కడికీ ఒక రోజు అంది తల్లితో.

"ఈ వెధవ వుద్యోగం మానేస్తే బాగుండును" అని. దానికి తల్లి ఆశ్చర్యంగా చూస్తూ "అదేవిఁటే- ఆయన దయవల్ల వచ్చిందిగాని, నీకు కావాలంటే యిలాంటి వుద్యోగం కోటి జన్మలెత్తినా వస్తుందా" అంది.

"చుట్టూ మగాళ్ళూ, కొక్కిరాయి మాటలూ, కోతి చేష్టలూ చిరాకుగా వుంటుంది" అంది విసుగ్గా.

"మన దారిని మనం పోవడమే" అంది తల్లి నెమ్మదిగా. ఆమె ఈ వుద్యోగం చెయ్యడం గురించి ఆలోచించలేదు. కనీసం వూహించనైనాలేదు. కాని హరిణి జీతం యింటికి రాకపోతే యింటి పరిస్థితి మాత్రం వూహించగలదు. అందుకే అలా అంది.

ఇంతలో వనజ అందుకుంది.

"అయినా అన్నిటికీ నువ్వు ఉమ్మెత్తపువ్వులా ముడుచుకుపోతే ఎలాగే, సరదాగా వుండాలి. నలుగురితో కలిసిమెలిసి తిరగాలి. నీది నాను ముచ్చుతనం. ఎవరూ ఏమీ అనకపోయినా ముడుచుకుపోతూంటావు." అంది బోధ చేస్తున్నట్లు.

హరిణికి వనజ మీద అసహ్యం వేసింది. తనకంటే మూడేళ్లు చిన్నది. తనకే బుద్ధులు చెప్తోంది. పైగా కలిసిమెలిసి వుండాలిట. 'ఇది మరీ బరితెగించిపోయింది.' అనుకుంది. పైకి మాత్రం ఏమీ అనలేదు. నిశ్శబ్దంగా వుండిపోయింది. తల్లి వనజ మాటలు విని ఏమీ అనకపోవడం హరిణికి మరీ ఆశ్చర్యమేసింది.

*

వ్యాఘ్రేశ్వర్రావు ఏదో సమయం చూసుకుని పార్టీ యివ్వలేదే అంటాడు. ఏం సమాధానం చెప్పాలో ఆమెకి తెలీక తికమక పడుతుంది.

"మీరింక పార్టీ యివ్వకపోతే వదిలేదిలేదు." అన్నాడు చిరునవ్వుతో.

హరిణి వెంటనే బ్యాగ్‌లోంచి రూపాయి తీసి రెండు కాఫీలు తెమ్మంది ప్యూనుతో.

వ్యాఘ్రేశ్వర్రావు చప్పరించేశాడు. "ఓస్ యిదా! ఎవరిక్కావాలి? కాఫీ!! మీకు వరుసగా నేనిప్పిస్తా" అన్నాడు.

"మరి పార్టీ అంటే యింకేవిటి?" అంది.

"ఇస్తానని అనండి. నేచెప్తా" అన్నాడు సూటిగా చూస్తూ. హరిణికి అర్థమౌతూనే వుంది. కాని ఏమీ తెలీనట్లు ముఖం పెట్టి "నేనంత ధనవంతురాల్ని కాను" అంది.

"అమ్మమ్మా, మీ దగ్గరున్న ధనరాసుల గురించి మీకేం తెలుసు? కొన్ని లక్షలు పోసినా అవి దొరకనివి" అన్నాడు. హరిణి ఆశ్చర్యపోయింది. నిజంగా తనలో ఏముంది? గుండె ఝల్లుమంది.

ఎంతో అపురూపంగా, కలకాలం దాచుకోవాల్సిం దాన్ని కొల్లగొట్టాలని చూస్తారు అందరూ. అతని వుద్దేశం అర్థమై మనసు వికలమైపోయింది. సమాధానం ఎలా చెప్పాలో తెలీలేదు. నవ్వి వూరుకుంది.

*

హరిణికి ప్రొబేషన్ ఒక సంవత్సరం పొడి గించబడింది. కారణం ఎవ్వరికీ తెలీదు. ఆఫీసులో అంతా అయ్యో పాపం అనుకున్నారు. చాలా హార్డువర్కర్ అని కూడా అనుకున్నారు. హరిణికి తల కొట్టేసినట్లు అనిపించింది. ఎందుకలా జరిగిందో తెలిసినా బయటపెట్టే విషయం కాదు. అందుకే చాలామందితో తనే పరీక్ష బాగా రాయలేదని చెప్పుకుంది.



ఫెయినా

విద్యార్థులకే కాదు ఉపాధ్యాయినులకు కూడా ఆటలలో ఆసక్తి, బహుమతులు గెల్చుకోవాలన్న ఉత్సాహమూ వుంటాయనడానికి ఉదాహరణ సోవియట్ క్రీడాకారిణి ఫెయినా మెల్నిక్-వెలెవా. 35 సంవత్సరాల వనిత ఫెయినా-మాస్కోలో ఉపాధ్యాయినిగా పని చేస్తూ, 'డిస్కస్'ను విసరడంలో విశేషమైన ప్రావీణ్యం సంపాయించింది. "మాస్కోలో జరగనున్న ఒలింపిక్స్‌లో విజయం సాధించడానికి చాలా గట్టిగా కృషిచేస్తున్నాను!" అంటున్నదామె.

తొలిసారిగా ఫెయినా '76లో మాంట్రియల్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొని - పలువురు క్రీడాభిమానులను ఆకర్షించింది. అప్పటికే ఆమె డిస్కస్'ను విసరడంలో కొన్ని రికార్డులు స్థాపించింది.

గత సంవత్సరం 'డిస్కస్'ను విసరడంలో ఫెయినా స్థాపించిన ప్రపంచ రికార్డు (70.52)ను జాల్ (జర్మన్ డెమొక్రాటిక్ రిపబ్లిక్) అనే యువతి అధిగమించింది. ఆమె డిస్కస్‌ను ఫెయినా కంటే 22 సెంటీమీటర్లు ఎక్కువ దూరం విసిరింది. '78లో యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో ఫెయినాకు ఐదవ స్థానం లభించింది. ఈ సంవత్సరం - ఆమె డిస్కస్‌ను విసరడంలో మరింత అభివృద్ధి సాధించింది. "ఇది వరకు చేసిన పొరబాటు ఇప్పుడు మళ్ళీ చెయ్యను!" అంటున్న ఫెయినాకు రానున్న ఒలింపిక్స్‌లో తన విజయం పట్ల గట్టి నమ్మకమే వున్నది!

వనజ సెకండ్ బి. ఏ లోకి వచ్చింది. ఆ రోజే ఎంప్లాయిమెంటులో రిజిష్టర్ చేసింది. 'ఎందుకే' అంటే—"ఉద్యోగం వచ్చేసరికి చాలాటైము పడుతుంది. ఒకవేళ అది త్వరగా వస్తే చదువు మానేస్తా" అన్నది.

హరిణి ఆశ్చర్యపోయింది.

"అంత అవసరమేముంది?" అంది. "ఉద్యోగంలో చేరితే నాకు స్వేచ్ఛ వచ్చినట్లు వుంటుంది" అన్నది వనజ.

"ఇప్పుడు నీకేం తక్కువైంది? ఎందుకు నలుగురిలో తిరిగే స్వేచ్ఛ?" అని అందామనుకుంది హరిణి. కాని అనలేదు. దాని కెలాంటి జవాబు వచ్చినా వినటానికి తను సిద్ధంగా లేదు.

*

ఆ రోజు ఆఫీసు నించి మరీ ఆలస్యంగా ఇంటికి వస్తుంటే హరిణికి భయమేసింది. అమ్మ నిలేసి అడుగుతుంది. 'అందరికీ లేవా ఉద్యోగాలు, నీ కొక్కదానికేనా, ఆడపిల్లవు ఇంతసేపు ఆఫీసుల్లో వుంటే పరువేమైనా వుంటుందా' అని అరుస్తుంది. అంతగా కాకపోతే వుద్యోగం మానెయ్ అని బెదిరిస్తుంది. నిజంగా అమ్మ అలా అంటే ఎంత బాగుండును. తను రేపే రాజీనామా ఇచ్చేస్తుంది.

ఆలోచనలతోనే యింట్లో అడుగుపెట్టింది హరిణి. తల్లి ఏమీ మాట్లాడలేదు. "అయ్యో అలా అలిసిపోయి వచ్చేవేమ్మా—కాఫీ కలిపిస్తా" అంటూ ఓపిక లేకపోయినా కాఫీ కలిపి యిచ్చింది.

వనజ నిరసనగా, చులకనగా చూడలేదు. 'అక్కా, వంట నేచేసేశాను. ఆకలేస్తే చెప్పు. మనిద్దరం తిందాం' అని పుస్తకంలో మునిగిపోయింది. తను యిలా యింత రాత్రివరకు వుండి పని చెయ్యడం ఎంతో సామాన్యమైన విషయంగా భావిస్తున్నారు యింట్లో. అయ్యో! తన్నెందుకు తిట్టరు? కేకలెయ్యరు? అనుమానించరు! ఉద్యోగం మానిపించేయరు?

బాధగా హరిణి మంచం మీద వాలి కళ్ళు మూసుకుంది.

రెండోసారి కూడా ప్రొబేషన్ పొడిగించమని పైకి రాసేస్తానని బెదిరించాడు వ్యాఘ్రేశ్వరరావు ఆరోజు. తనంటే ఎంతోమంది అమ్మాయిలు పడి చస్తారుట. కాని తనకి ఎందుకో హరిణి అంటే ఎనలేని ప్రేమట. అతను తన కోసం చచ్చిపోతున్నాట్ట. ఆమె లేకపోతే బ్రతుకే నిస్సారంగా అనిపిస్తోందిట. తన కోరిక తీర్చకపోతే ముందడుగు లేదని బెదిరించాడు. రెండు, మూడుసార్లు చూసి ప్రొబేషన్ ప్యాస్ కాకపోతే వుద్యోగం వూడిపోతుందని వివరించాడు.

ఆ క్షణంలో వుద్యోగం పోతుందంటే బాధగా అనిపించింది.

తనకి వెంటనే వరుడిని చూసి పెళ్లి చేసెయ్యటానికి నాన్న లేడు అని తలుచుకుని కుమిలి ఏడ్చింది హరిణి.

ఆరోజు బాగా వెలుగుండగానే యింటికి వచ్చేసింది. గుమ్మంలో అడుగు పెడుతూనే ముందు గదిలో ఎవరో కూర్చుని మాట్లాడుతుండటం చూసి, తలొంచుకుని లోపలికెళ్ళిపోయింది. దూరంగా గడప దగ్గర అమ్మ కూర్చుని ఆ వచ్చిన పెద్ద మనిషితో మాట్లాడుతోంది. హరిణిని చూడగానే—

"అదిగో అమ్మాయి మాటల్లోనే వచ్చేసింది" అంది.

"సరే, మీరు బాగా ఆలోచించుకుని చెప్పండి" అన్నాడాయన. లోపలున్న హరిణికి వాళ్ల మాటలు స్పష్టంగా వినిపిస్తూనే వున్నాయి.

"ఆలోచించాల్సిందేమీ లేదు. మా అబ్బాయికి పధ్నాలుగో ఏడు. వాడు బి. ఏ. ప్యాసయి, నాలుగు రాళ్ళు సంపాదించేవరకు దీని పెళ్ళి మాట ఎత్తే పనిలేదు. అయినా ఏమంత వయసు? ఇరవై రెండు. ముప్పై ఏళ్ళు పైబడి పెళ్ళిళ్ళు కాకుండా బోలెడు మంది వుంటున్నారు."

"మరే—మరే" అంటున్నాడా వచ్చినాయన.

"అయినా అది పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే యిప్పుడు యిల్లు గడిచేదెట్లా—నావల్ల కాదు. ఏదో దేవుడి దయవల్ల దానికైనా వుద్యోగం వచ్చింది" అంటూ నిట్టూర్చింది తల్లి.

హరిణి కొయ్యబారిపోయింది. ఇరవై రెండేళ్ళు పెళ్ళికి వయసు కాదా అని కుమిలిపోయింది. కాస్సేపు ఏవో కబుర్లు చెప్పి ఆ పెళ్ళి పెద్ద వెళ్ళిపోయాడు. మగపిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. వనజ ఏవో బొమ్మ లేసుకుంటోంది.

హరిణి ఆలోచనల తడబాటుతో అన్నం కూడా తినకుండా పడుకుంది. తండ్రి పోయాక, వచ్చే ఇన్సూరెన్సు వచ్చింది. అమ్మ దాంట్లోంచి పైసా తియ్యకుండా అయిదేళ్ళకి ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసింది. ఆ డబ్బు తీసే వుద్దేశం లేదని, తనకి పెళ్ళి చేసే వుద్దేశం లేదనీ తెలుస్తూనే వుంది. మనసులో కోర్కెలని, వయస్సులోని వుత్సాహాన్ని అదుపులో పెట్టే శక్తి తనకి నానాటికీ తగ్గిపోతోంది. ఎన్నో సరదాలున్న యీ లోకంలో అన్నీ కాకపోయినా కొన్ని సుఖాలనుభవించాలని మనసు ఉవ్విళ్ళూరిపోతోంది. కన్నవారి మీదా, చుట్టూ వున్న వారి మీదా కసితో మనసు బండబారిపోయింది.

*

ఆఫీసుకెళ్ళగానే వ్యాఘ్రేశ్వర్రావు పిలుస్తున్నట్లు కబురొచ్చింది. సీట్లో కూర్చుని రెండే నిముషాలు తీవ్రంగా ఆలోచించుకుని లేచింది. ఎప్పుడూ భయంగా, బెరుకుగా, తడబాటుగా వెళ్ళే హరిణి దర్జాగా, విలాసంగా, దర్పంగా వెళ్ళింది. అతనితో మాట్లాడి చిరునవ్వుతో బయటికొచ్చింది.

సాయంత్రం ఆరు గంటలకి హరిణి ట్రిమ్‌గా తయారై ఆఫీసులో పనుందని తల్లితో చెప్పి బయలుదేరింది. సందె ముగ్గు వేద్దామని గుమ్మంలో కొత్తుగా చల్లిన కళ్లాపుకి బురదగా వున్న గుమ్మంలో కాలు జారింది. ఒక్కక్షణం నిలదొక్కుకుని ముందుకు కదిలింది హరిణి.

*

పరుగెడుతున్న లేడిపిల్ల అలసిపోయింది. తన వాళ్ళెవరూ కనిపించలేదు. ఇహ ఓపిక లేదు—ఎవరి కోసం తను బ్రతకాలనుకుందో వారెవ్వరూ కనిపించలేదు. అందుకని తనే పులికి ఎదురెళ్ళి బలైపోదామని బయలుదేరింది! □



బాగా మురికిగా వున్న తోలు పెట్టెలు, నిమ్మకాయతో రుద్దితే అందంగా మెరుస్తూ వుంటాయి.



బొద్దింకలు వుంటే కొద్దిగా బియ్యంపిండి తీసుకుని, దానిలో కొంచెం బోరిక్ పౌడరు వేసి నీళ్ళలో కలిపి చిన్నచిన్న వుండలుగా చేసి బొద్దింకలు వున్నచోట అక్కడక్కడా పెట్టండి. తగ్గిపోతాయి.